క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మానవత్వం చాటుకున్న ఏఎన్ఎంలు



నగదు అందిస్తున్న నారాయణపురం ఏఎన్ఎంలు

మహానంది: నంద్యాల పట్టణంలోని విశ్వనగర్ సాయిబాబా గుడి వీధిలో నివాసముంటున్న వాల్మీకి గుత్తికావలి జ్యోతికి ఇటీవల ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆమె చికిత్సకు సహాయ, సహకారాలు అందించాలని సోషల్ మీడియాలో వచ్చిన సందేశానికి బండిఆత్మకూరు మండలం నారాయణాపురం ఆరోగ్య కేంద్రం సిబ్బంది స్పందించారు. ఏఎన్ఎంలు వీరమ్మ, బాల హుసేనమ్మ, పద్మావతి మంగళవారం తమ వంతుగా రూ.6వేలు సహాయం అందించారు.

యథేచ్ఛగా మంచి నీళ్ల వ్యాపారం



పట్టణంలో అనుమతుల్లేకుండా వెలిసిన మంచినీళ్ల వాటర్ ప్లాంట్లు

నందికొట్కూరు: పట్టణంలో కొందరు అనుమతుల్లేకుండా మంచినీళ్ల వ్యాపారం చేస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలో దాదాపు 70 వేల జనాభా, దాదాపు 14 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాగా, ప్రజలు మినరల్ వాటర్‌పైనే ఆసక్తి చూపుతుండటంతో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అనుమతులు లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నీటి విక్రయాలు జరుపుతున్నారు. పట్టణవాసులు ఒక్కో బిందె రూ.10లు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యతలేని మినరల్ వాటర్‌ను దుకాణాల్లో ఒక లీటర్ లూజ్ బాటిల్ వాటర్ రూ.4లకు విక్రయిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. డబ్బులిచ్చి తాగునీరు కొనుగోలు చేసి అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు తనిఖీలు చేసి ప్రజలకు శుద్ధమైన నీటిని అందించేలా చూడాలని కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డిని వివరణ అడగగా వాటర్ ప్లాంట్ల యజమానులకు నోటీసులిచ్చాం. అనుమతులేని వాటర్ ప్లాంట్లను సీజ్ చేస్తామని, బిందెనీరు రూ.10లకు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవాలు



రెడ్డిపల్లెలో నిర్మించిన అభయ ఆంజనేయ ఆలయం

రుద్రవరం: మండలంలోని రెడ్డిపల్లెలో అభయ ఆంజనేయ స్వామి,చౌడేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో అర్చకులు పుల్లయ్య ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు చేపట్టి, అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. హోమాలు జరిపించి పూర్ణాహుతి గావించారు.

వాహనాల దారి మళ్లింపుతో ఇబ్బందులు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడమెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల వద్ద కౌంటింగ్ సందర్భంగా అధికారులు హైవేపై వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. మంగళవారం తెల్లవారుజామున నుంచి కౌంటింగ్ ముగిసే వారకు హైవేపై బలపనూరు మెట్ట నుంచి పాణ్యం డొంగు వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర వాహనాలను డైవర్షన్ చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల డైవర్షన్ కోసం హైవే అధికారులు ప్రత్యేక మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు.

కనుమరుగవుతున్న చేతిపంపులు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- నిర్వహణపై లోపించిన పర్యవేక్షణ
- రిపేరు చేసే మెకానిక్‌లు కరువు
- నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతున్న బోరింగ్‌లు





తాటిపాడులో సర్పంచు ఇంటికి సమీపంలో మరమ్మతులకు నోచుకోక శిథిలమైన చేతిపంపు, మండ్లెంలో ఇలా..

జూపాడుబంగ్లా: ఐదేళ్ల క్రితం వరకు వేసవికాలం వచ్చిందంటే చాలు గ్రామీణ ప్రాంతాల్లో ఏ చేతిపంపు (బోరింగు) వద్ద చూసినా తాగునీటికోసం బిందెలు బారులుగా పెట్టిన దృశ్యాలు కనిపించేవి. ప్రజల దాహార్తి తీర్చేవి. అయితే నేడు అవి కనుమరుగయ్యే దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా చేతిపంపులు మరమ్మతులకు, నిర్వహణకు నోచుకోక నిరుపయోగంగా మారుతున్నాయి.

మండలంలో పనిచేస్తున్న పంపులు 165

మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో 240 చేతిపంపులున్నాయి. అందులో 30 చేతిపంపులు పూర్తిగా డ్యామేజీ కాగా 45 సీజనల్‌గా పనిచేసేవి ఉన్నాయి. ప్రస్తుతం 165 చేతిపంపులు మాత్రమే 12 గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్నట్లు తాగునీటిశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గ్రామీణ ప్రాంతాల్లో చేతిపంపులు(బోరింగులు) క్రమేణా కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. ప్రస్తుతం ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉండటంతో గ్రామాల్లోని చేతిపంపులపై ఆధారపడే వారు తగ్గిపోయారు. కుళాయిలకు నీరు రానిసమయంలో బోరింగ్‌లనే ఆశ్రయించాల్సి వస్తుంది. అయితే చేతిపంపులు మరమ్మతులకు గురైతే వాటికి రిపేరు చేసే మెకానిక్‌లు లేక ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంటున్నాయి. ముఖ్యంగా చేతిపంపుల పనితీరుపై పర్యవేక్షణ, నిర్వహణ లోపం తో పాటు కొత్తగా బోర్లు తవ్వించి చేతిపంపు ఏర్పాటు చేయకపోవటం వంటి కారణాల వల్ల క్రమేణా పూడిపోతున్నాయి. ఎంపీడీఓ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా చేతిపంపులు మరమ్మతులకు నోచుకోవడం లేదని గ్రామాల్లోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిలకు తాగునీరు సరఫరాకాని సమయంలో చేతిపంపులు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

చేతిపంపులకు మరమ్మతులు చేయాలి

మా ఇంటికి సమీపంలో ఉన్న చేతిపంపు మరమ్మతుకు గురైంది. ఏడాది పైబడినా ఇప్పటిదాకా రిపేరి చేయలేదు. బోరులో నీళ్లు పుష్కలంగా ఉన్నప్పటికీ నిరుపయోగంగా మారింది. కుళాయిలకు నీళ్లు రాని సమయంలో చేతిపంపు నీటిని పట్టుకునేవాళ్లం. ప్రస్తుతం బోరు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు చేతిపంపుకు మరమ్మతు చేయించాలి.

– మాసుంబాషా, తాటిపాడు

లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే మరమ్మతులు చేయిస్తాం

మండలానికి పర్మినెంట్ బోరు మెకానిక్ లేదు. వేసవి నేపథ్యంలో తాత్కాలిక మెకానిక్‌ను నియమించాం. గ్రామాల్లో ఎక్కడైనా చేతిపంపులు మరమ్మతులకు గురైతే వాటికి సంబంధించిన వివరాలతో లిఖితపూర్వకంగా పంచాయతీ కార్యదర్శులకు తెలియజేస్తే వారి ద్వారా బోరింగ్‌లకు రిపేరీ చేయిస్తాం.

– నాగేంద్ర, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్



తర్తూరులో నిరుపయోగంగా మారిన చేతిపంపు

ఇది ప్రజా విజయం



గిత్తా జయసూర్య

నందికొట్కూరు: ఇది ప్రజా విజయమని నందికొట్కూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం నంద్యాల–కర్నూలు రోడ్డులో ఉన్న ఆర్జీఎం కళాశాలలో నిర్వహించిన ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత ఆయన విలేకరులతో మాట్లాడారు. నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలు టీడీపీని గెలిపించారని అన్నారు. కనీవిని ఎరుగని రీతిలో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా తనను ఆశీర్వదించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయంటే..

నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,18,047 గాను 1,86,853 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,018 ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీడీపీ అభ్యర్థికి 1,200, వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి 677, కాంగ్రెస్ అభ్యర్థికి 105 వచ్చాయి. ఈవీఎం ఓట్లలో టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్యకు 92,004 ఓట్లురాగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ దాదా సుధీర్ 82,212 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థికి 9,792 ఓట్ల మోజార్టీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తొగురు ఆర్థర్‌కు 7,949 వేల ఓట్లు వచ్చి మూడో స్థానంలో నిలిచారు.

విత్తుకు సిద్ధమవుతున్న రైతులు



నందికొట్కూరు పట్టణంలో మొక్కజొన్న విత్తనాల కోసం దుకాణం వద్ద రైతులు

జూపాడుబంగ్లా: ఖరీఫ్ ప్రారంభంలోనే ఆశాజనకంగా వర్షం కురవటంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. 15,250 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, 80బన్నూరు, తంగడంచ, పారుమంచాల, తూడిచెర్ల, తరిగోపుల, భాస్కరాపురం గ్రామాల్లో అత్యధికంగా మొక్కజొన్న పంటను సాగుచేస్తారు. బోర్లు, బావులున్న పొలాలతో పాటు కేసీ కాల్వ ఆయకట్టు రైతులు కూడా అధికంగా మొక్కజొన్న పంటను సాగు చేస్తారు. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలు విత్తుకు అనుకూలంగా మారడంతో రైతులు మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసేందుకు నందికొట్కూరు పట్టణంలోని విత్తనాల దుకాణాల వద్దకు చేరుకుంటున్నారు. ఇదే అవకాశంగా భావించిన విత్తనాల దుకాణాల దారులు విత్తనాల ప్యాకెట్ ధరలను అమాంతం పెంచేసి అధికధరలకు విత్తనాల ప్యాకెట్లను అంటగట్టారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకొని ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన మొక్కజొన్నల విత్తనాలను రాయితీపై అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

కాళికాంబకు అష్టాదళ పాదపద్మారాధన



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రోశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టి అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి, వివిధ రకాల పూలతో పూలంగి సేవ కార్యక్రమం జరిపించారు. అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం అనంతరం 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

కొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో గ్రామాలలో ఎక్కడైనా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు ఉంటాయని ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలలైన కొత్తపల్లి, శివపురం గ్రామాలలో పోలీస్ పికెట్, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. వీటితో పాటు దుద్యాల, కొక్కెరంచ, నందికుంట, గోకవరం గ్రామాలలో బందోబస్తు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గెలిచిన పార్టీల నాయకులు గాని, కార్యకర్తలుగానీ సంబరాలు చేసుకునేందుకు, విజయోత్సవర్యాలీలు చేసేందుకు అనుమతులు లేవని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గ్రామాల్లో పోలీస్ పికెట్

పగిడ్యాల: మంగళవారం కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మకం, అత్యంత సమస్యాత్మకమైన నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట గ్రామాల్లో జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముచ్చుమర్రి ఎస్ఐ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం కౌటింగ్ ప్రక్రియ ముగిసే వరకు గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా బందోబస్తు చేపట్టారు. ఎక్కడా కూడా అల్లర్లు చోటుచేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.



దుద్యాలలో పోలీస్ పికెట్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ హరిప్రసాద్

పాములపాడు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలో మంగళవారం 144 సెక్షన్ అమలు చేశారు. పోలీసులు అన్ని గ్రామాల్లో పికెట్ నిర్వహించారు. ప్రజలు కూడా రోడ్లపై ఎక్కడా కనిపించలేదు. అందరూ కూడా ఓట్ల లెక్కింపు ఫలితాలను చూస్తూ టీవీలకు అతుక్కుపోయారు. దుకాణాలు కూడా స్వచ్ఛందంగా మూసి వేశారు.

ప్రమాదకరంగా గుర్రపు డెక్క



క్రిష్ణిపాడులో బ్రిడ్జికి అడ్డుగా గుర్రపుడెక్క

దొర్నిపాడు: భారీ వర్షాల కారణంగా కుందూకు ఉధృతంగా వర్షపు నీరు చేరడంతో ఎగువ ప్రాంతాల నుంచి గుర్రపు డెక్క భారీగా కొట్టుకొస్తోంది. గుర్రపు డెక్క క్రిష్ణిపాడు వద్దనున్న వంతెన వద్ద నిలిచి ప్రవాహానికి అడ్డంగా మారింది. ప్రస్తుతం నదిలో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గుర్రపు డెక్కను తొలగించకపోతే బ్రిడ్జికి ప్రమాదం వాటిల్లే అవకాశముందని స్థానికులు పేర్కొంటున్నారు.

పశువైద్య భవనం ఏర్పాటు చేయండి



శిథిలావస్థకు చేరిన భవనం

నంద్యాల(అర్బన్) : పశుసంపదకు నిలయమైన నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామంలో నూతన పశువైద్య భవనాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా పాడుబడిన భవనంలో పశువులకు వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో వైద్యసేవలకు అక్కడికి వెళ్లాలంటే పశుపోషకులు భయాందోళన చెందుతున్నారు. కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న భవనంలో సిబ్బంది అభద్రతాభావంతో విధులు నిర్వహిస్తున్నారు. ఇక అక్కడ పశువుల వైద్యానికి కనీస వసతులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకొని సౌకర్యాలతో కూడిన నూతన భవనం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ఉత్కంఠగా సాగిన కౌంటింగ్

- పలు రౌండ్లలో వైఎస్సార్‌సీపీకి ఆధిక్యం, కొన్నింటిలో టీడీపీకి..
- చివరికి శ్రీశైలం ఎమ్మెల్యేగా బుడ్డా విజయం
- 6,383 ఓట్ల మెజార్టీ



బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రజల్లో ఉత్కంఠ రేపింది. చివరికి టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డిపై విజయం సాధించారు. టీడీపీ అభ్యర్థికి 6,383 ఓట్ల మెజార్టీ దక్కింది. నియోజకవర్గంలో మొత్తం 1,61,116 ఓట్లు పోల్ కాగా, టీడీపీ అభ్యర్థికి 80,630 ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డికి 74,689 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గంలో హోరాహోరీగా జరిగిన పోలింగ్ సరళిలో తొలి రౌండ్ నుంచి 23 రౌండ్లు పూర్తి అయ్యే సమయానికి నువ్వా నేనా అన్న రీతిలో ఓట్లు వచ్చాయి. పలు రౌండ్లలో వైఎస్సార్ సీపీకి ఆధిక్యం రాగా.. కొన్నింటిలో టీడీపీకి మెజార్టీ వచ్చింది. శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు మండలాల్లో ఈ పోరు నడవగా చివరగా బండిఆత్మకూరు, మహానంది మండలాలు టీడీపీకి విజయం సాధించి పెట్టాయి.



ఈవీఎంలో ఓట్ల వివరాలను ఏజెంట్లకు చూపుతున్న అధికారులు

హోరాహోరీగా కొనసాగిన రౌండ్ల లెక్కింపు

శ్రీశైలం నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ మధ్య పలు రౌండ్లు నువ్వా నేనా అన్న రీతిలో కొనసాగాయి. ప్రారంభమైన తొలి రౌండ్‌లో టీడీపీ ఆధిక్యత కొనసాగించగా, రెండో రౌండ్‌లో 580 ఓట్ల మెజార్టీతో వైఎస్సార్‌సీపీ ముందంజలో కొనసాగింది. ఇలాగే 5, 7, 8, 9, 18 రౌండ్లలో వైఎస్సార్‌సీపీ ఆధిక్యత కొనసాగించింది. కాగా బండిఆత్మకూరు మండలం రౌండ్ ప్రారంభమయ్యేంతవరకు వైఎస్సార్‌సీపీ తమ హవాను కొనసాగించి మెజార్టీ దిశ వైపు ముందుకు సాగింది. చివరగా టీడీపీని విజయం వరించింది.

రౌండ్ల వారీగా పోలైన వివరాలు ఇలా ఉన్నాయి..

రౌండ్లు	టీడీపీ	వైఎస్సార్‌సీపీ	పార్టీమెజార్టీ వివరాలు
1	3,510	2,283	1,227 (టీడీపీ)
2	2,550	3,080	580(వైఎస్సార్‌సీపీ)
3	3,150	3,074	76 (టీడీపీ)
4	4,136	3,941	195 (టీడీపీ)
5	2,830	3,247	417(వైఎస్సార్‌సీపీ)
6	3,186	3,139	147(టీడీపీ)
7	3,455	4,183	732(వైఎస్సార్‌సీపీ)
8	2,286	4,988	2702వైఎస్సార్‌సీపీ
9	3,813	3,669	456 వైఎస్సార్‌సీపీ
10	3,855	3,375	480(టీడీపీ)
11	3,907	2,624	1283(టీడీపీ)
12	3,655	2,801	854 (టీడీపీ)
13	3,493	2,950	543(టీడీపీ)
14	4,803	3,328	1475(టీడీపీ)
15	4,565	3,219	346 (టీడీపీ)
16	3,623	3,159	464(టీడీపీ)
17	3,599	2,867	732 (టీడీపీ)
18	3,607	4,129	522(వైఎస్సార్‌సీపీ)
19	3,547	3,516	31 (టీడీపీ)
20	3,645	2,541	1404 (టీడీపీ)
21	3,915	3,313	602 (టీడీపీ)
22	3,346	3,139	407 (టీడీపీ)
23	1,904	1,820	84 (టీడీపీ)

పోస్టల్ బ్యాలెట్ వివరాలు

టీడీపీ	వైఎస్సార్‌సీపీ	ఇతరులు
841	400	12

ఆలయ పరిసరాల్లో దర్శనమిచ్చే నంది, ఈశ్వరుడి చిత్రపటం







ఆలయ మహాద్వారం దాటగానే కుడివైపున ఉన్న నవ వినాయకులు, ఎడమవైపున ఉన్న నవదుర్గలు

ఆధ్యాత్మిక ఆనందం!

దట్టమైన నల్లమలలో వెలిసిన మహానంది ఆలయ పరిసర అందాలు భక్తులకు మహానందం కలిగిస్తున్నాయి. పచ్చటి చెట్లు, ప్రకృతి అందాలు, పక్షుల కిలకిలరావాలు, కోనేటి జలసవ్వడులు భక్తులును మంత్రముగ్ధులను చేస్తాయి. ఆలయానికి వచ్చిన వెంటనే రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదైన కృష్ణశిలతో చేసిన నంది బసవన్న, ఆలయానికి ఇరు వైపులా ఏర్పాటు చేసిన వివిధ రకాల వాయిద్యాలను చేతబూని మనసును ఉత్తేజపరిచే విచిత్ర గణపతులు, వివిధ రకాల ఆయుధాలను ధరించిన నవదుర్గలు భక్తులను ఆధ్యాత్మికానందానికి గురిచేస్తున్నాయి. ఆలయ రాజగోపురం దాటిన వెంటనే అటూ, ఇటూ రెండు కోనేరులు, పచ్చటి చెట్లు, పార్వతీ పరమేశ్వరులు. ఈ దృశ్యాలను చూసిన భక్తులు మంత్రముగ్ధులవ్వక తప్పదు.

– మహానంది



నీలకంఠుడికి నీలాకాశం నీడ